# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక




ఏపీకి వరాల జల్లు..

## తెలంగాణకు మొండిచేయి

కేంద్ర బడ్జెట్‌లోని ముఖ్యాంశాలు 2


సంపుటి: 2 | సంచిక: 104 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 24 జులై 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్


# 9 ప్రాధాన్య అంశాల ఆధారంగా కేంద్ర బడ్జెట్



### ఆ 4 రంగాలపై ఆర్థిక మంత్రి నిర్మలమ్మ ఫోకస్

రికార్డుస్థాయిలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఏడుసార్లు బడ్జెట్‌లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఈ ఘనత సాధించిన తొలి మహిళగా ఆమె రికార్డు నెలకొల్పారు. ఇక, కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తొమ్మిది రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. మొత్తం 48.21 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించారు. ఇందులో పన్నుల ద్వారా రూ.28 లక్షల కోట్లు.. పన్నేతర ఆదాయం రూ. 4 లక్షలు కోట్లుగా పేర్కొన్న కేంద్రం.. ద్రవ్య లోటు 4.9 శాతంగా తెలిపింది.

- పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- బిహార్‌కు పెద్ద పీట వేసిన నరేంద్ర మోదీ సర్కారు
- ఏపీ రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు


న్యూఢిల్లీ, జులై 23 (ప్రభాత ఉదయం): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈసారి 9 ప్రాధాన్య అంశాల ఆధారంగా బడ్జెట్ ప్రవేశపెట్టారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, యువతకు ఉద్యోగ కల్పన - నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, ఇంధన భద్రత, పట్టణాభివృద్ధి, మౌలిక రంగం, పరిశోధన - ఆవిష్కరణలు, తయారీ - సేవలు, భవిష్యత్ సంస్కరణలు వంటి అంశాలను బడ్జెట్‌లో ప్రస్తావించారు. ఈ ప్రాధామ్యాలపై భవిష్యత్ బడ్జెట్స్ కూడా ఆధారపడి ఉంటాయని తెలిపారు. వీటిలో సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు, మధ్య తరగతి రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఎక్కువగా మహిళలు, రైతులు, పేదలు, యువతకు మేలు చేకూర్చేలా బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు.

**యువతకు ప్రాధాన్యం**

రాబోయే ఐదేళ్లలో రూ.2 లక్షల కోట్లతో 4.1 కోట్ల మంది యువతకు ప్రయోజనం చేకూర్చే పథకాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తుందని నిర్మలమ్మ తెలిపారు. అలాగే, 20 లక్షల మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేలా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్ అభివృద్ధి చేస్తామని చెప్పారు. భారతీయ విద్యా సంస్థల్లో ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు రూ.10 లక్షల వరకూ విద్యా రుణాలు ..మిగతా 2లో

## మధ్య తరగతికి మేలు చేసే బడ్జెట్ ఇది

### నిర్మలా సీతారామన్ పద్దుపై ప్రధాని ప్రశంసలు



న్యూఢిల్లీ, జులై 23 (ప్రభాత ఉదయం): నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. మధ్య తరగతి వర్గానికి సాధికారత కలిగించే విధంగా ఈ పద్దు ఉందని వెల్లడించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ 2024-25 ప్రవేశపెట్టారు. దీనిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. సీతారామన్ పద్దుపై ప్రశంసలు కురిపించారు. మధ్యతరగతి ప్రజలకు ప్రాధాన్యత ఇచ్చిన బడ్జెట్ అని స్పష్టం చేశారు. రైతులు, పేదలను దృష్టిలో పెట్టుకుని నిర్మలా సీతారామన్ ఈ పద్దుని రూపొందించారని వెల్లడించారు. ఈ పద్దుతో యువతకు భారీ స్థాయిలో ఉద్యోగావకాశాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. గత పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని,మధ్య తరగతి వర్గం సాధికారత సాధించే విధంగా ఈ బడ్జెట్ ఉందని తెలిపారు. విద్యారంగంతో పాటు నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టినట్టు స్పష్టం చేశారు. ఉద్యోగాల కల్పనలో భాగంగా ఎంప్లాయ్‌మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్‌ని తీసుకురావడం చాలా గొప్ప విషయమని అన్నారు.



# తెలంగాణపై ప్రధాని మోదీ కక్ష

### కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్ర శాసనసభలో చర్చ పెడతాం
### ఏపీలో అమరావతి, పోలవరానికి భారీగా నిధులు
### వికసిత్ భారత్ బడ్జెట్ కాదు నాయుడు-నితీష్ క్విడ్‌ప్రోకో బడ్జెట్
### దక్షిణాది ముఖ్యమంత్రుల సమావేశం నిర్వహిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జులై 23 (ప్రభాత ఉదయం): ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కార్ ప్రవేశపెట్టిన వికసిత్‌భారత్ బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ పదాన్ని కూడా నిషేధించారని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణపై కక్ష కట్టారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. పెద్దన్న హోదాలో ఉన్న ప్రధాని మోదీ కేవలం ఎన్డీఏ కూటమి రాష్ట్రాలకు మాత్రమే నిధులు కేటాయించుకోవడం దురదృష్టకరమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్డీఏ కూటమిలో భాగమైన బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు బడ్జెట్‌లో భారీ ఎత్తున కేటాయింపులు జరిగాయని, ఇది క్విడ్‌ప్రోకో బడ్జెట్ అని సీఎం రేవంత్ విమర్శించారు. ఏపీ రీఆర్గనైజేషన్ యాక్ట్ అంటే ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాదని, తెలంగాణ కూడా ఉందని ప్రధాని గుర్తించాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఏపీ రాజధాని అమరావతికి రూ. 15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయని, కానీ, తెలంగాణలో బయ్యారం ఉక్కు కర్మాగారం, పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, ఆర్ఆర్ ఆర్, మెట్రో విస్తరణకు నిధుల మంజూరు కాదుకదా, కనీసం వాటి ఊసే కేంద్రబడ్జెట్‌లో లేదని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. తెలంగాణలో ఐఐఎం మంజూరు చేయమని కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్ స్వయంగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరుతూ, 18 సార్లు ఢిల్లీ వెళ్లామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. గత పదేళ్లలో తెలంగాణకు కేంద్రం నుండి ఎటువంటి సహకారం లభించలేదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏర్పడిన గ్యాప్‌ను పూరించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం భేషజాలు లేకుండా ప్రయత్నించిందని సీఎం వివరించారు. ప్రధాని మోదీని తాను స్వయంగా మూడుసార్లు కలిశానని సీఎం అన్నారు. కానీ, ప్రధాని మాత్రం తెలంగాణ ప్రజల పట్ల ..మిగతా 2లో



# ముగిసిన బీఏసీ సమావేశం

### 25న బడ్జెట్.. 31 వరకు సభ

హైదరాబాద్, జులై 23 (ప్రభాత ఉదయం): తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో ఉన్న స్పీకర్ చాంబర్ లో బీఏసీ (బిజినెస్ అడ్వైజరీ కమిటీ) తాజాగా సమావేశమైంది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్లు, బీఆర్ఎస్ పార్టీ నుంచి హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి, బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం నుంచి బలాలలు హాజరయ్యారు. ఇక సమావేశంలో కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతిపట్ల శాసనసభ సంతాపం నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి కెటిఆర్ ప్రసంగించారు. ఆమె మృతికి సంతాపంగా హాల్ లోని సభ్యులందరూ 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. చివరగా అసెంబ్లీని వాయిదా వేశారు. ఇక ఆపై జరిగిన బీఏసీ సమావేశంలో.. ఈ నెల 31 వరకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఇక తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు 8 రోజుల పాటు జరగనున్నాయి. అసెంబ్లీలో రైతు రుణమాఫీపై చర్చ జరగనుంది. ఆ మరుసటి రోజు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు.

## జూరాలకు కొనసాగుతున్న వరద



గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 23(ప్రభాత ఉదయం)ఎగువ ప్రాంతంలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి వస్తున్న వరద నీటి ఉదృతితో పాటు కృష్ణానది జూరాల పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా వరద ఉదృతి జూరాలకు కొనసాగుతుంది. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటిని యధావిధిగా దిగువకు వదులుతూ వరద నీటిని నియంత్రిస్తున్నారు. జూరాల ప్రాజెక్టుపై ఆధారపడిన నెట్టెంపాడు, భీమా, ఎత్తిపోతల పథకాలతో పాటు కుడి, ఎడమ కాలువలకు సాగునీటిని యధావిధిగా విడుదల చేస్తున్నారు మంగళవారం సాయంత్రం నాటికి జూరాల జలాశయంలో 317.560 మీటర్లస్థాయిలో 7.759 టీఎంసీల పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోగా జూరాలకు ఎగువ ప్రాంతం నుంచి 1,65,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు 36 గేట్లను తెరచి దిగువకు 1,41,357 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. దీంతోపాటు విద్యుత్ ఉత్పత్తికి 29,433 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి 1,500, భీమా లిఫ్ట్-1కు 1,300, కుడి, ఎడమ కాలువలకు 1,248 క్యూసెక్కుల చొప్పున జూరాల నుంచి 1,70,790 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ అనే పదమే ఉచ్చరించలేదు

### మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం



హైదరాబాద్, జులై 23 (ప్రభాత ఉదయం): కేంద్రబడ్జెట్‌లో తెలంగాణ అనే పదమే ఉచ్చరించలేదని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి తెలంగాణకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. ఏపీ వెనుకబడిన జిల్లాల గురించి మాట్లాడారని, తెలంగాణలో వెనుకబడిన జిల్లాలు లేవా అంటూ ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా లేదు.. కిషన్ రెడ్డి ,బండి సంజయ్ ఏం చేస్తున్నారని ప్రశ్నలు గుప్పించారు. ఎనిమిది ..మిగతా 2లో

## అసెంబ్లీ సమావేశాల వేళ కేసీఆర్‌కు బిగ్ షాక్

### బీఆర్ఎస్ఎల్పీ మీటింగ్‌కు 8 మంది నేతలు డుమ్మా



హైదరాబాద్, జులై 23 (ప్రభాత ఉదయం): తెలంగాణలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వేళ గులాబీ బాస్ కేసీఆర్‌కు.. మరో బిగ్ షాక్ తగిలింది. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో.. సభలో అనుసరించాల్సిన వ్యూహాలపై కేసీఆర్ అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ఎల్పీ మీటింగ్‌కు.. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు సహా ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. కాగా.. ఈ మీటింగ్‌కు ఐదుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు డుమ్మా కొట్టారు. దీంతో.. పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే.. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ కండువా కప్పుకుంటూ.. కేసీఆర్‌కు షాక్ ఇస్తున్న విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో 39 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలుపొందగా.. ..మిగతా 2లో

# తెలంగాణపై ప్రధాని మోదీ కక్ష

**మొదటి పేజీ తరువాయి...**

కక్ష సాధిస్తున్నారని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ కేవలం ఆయన కుర్చీ కాపాడుకోవడానికి, సంకీర్ణ ప్రభుత్వంలోని పార్టీలను సంతృప్తి పరచడానికే ఈ బడ్జెట్ ప్రవేశ పెట్టినట్లుగా ఉందని సీఎం రేవంత్ ఎద్దేవా చేశారు. దేశంలోని ఐదు మెగా సిటీల్లో హైదరాబాద్ ఒకటని, కానీ కేంద్రం మాత్రం నగరాభివృద్ధికి కూడా నిధులు కేటాయించలేదని సీఎం ఆరోపించారు. రైతులను ఆదుకోవడానికి, విద్య, వైద్యం, ఇరిగేషన్, ఉద్యోగావకాశాల వంటి ఏ అంశంలోనూ కేంద్రం రాష్ట్ర ప్రభుత్వంపై జాలి చూపించలేదని సీఎం అన్నారు. గిరిజన యూనివర్సిటీ, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్డు, ఐటిఐఆర్ కారిడార్‌కు కూడా కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేంద్రప్రభుత్వం తెలంగాణపై చూపిన వివక్షను ఖండించేందుకు, కేంద్ర బడ్జెట్‌పై శాసనసభలో బుధవారం ప్రత్యేక చర్చ నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కేంద్రం చూపుతోన్న వివక్షపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోన్న పోరాటానికి రాష్ట్రంలోని రాజకీయపార్టీలన్నీ కలిసి రావాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం పని చేద్దామని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలు బీజేపీని నమ్మి పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి 35 శాతం ఓట్లేశారని, 8 మంది ఎంపీలను గెలిపించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలు ప్రధాని మోదీపై ఎంతో ప్రేమను చూపించారని, కానీ, ఆయన మాత్రం వారికి రిటర్న్ గిఫ్ట్ గుండుసున్నా ఇచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బీజేపీ ఎంపీలు, ఎంఐఎం ఎంపీ కాంగ్రెస్‌తో కలిసి పార్లమెంటులో ఎన్డీఏ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని సీఎం కోరారు. తెలంగాణకు చేసిన అన్యాయాన్ని సవరించుకునే అవకాశం ఇంకా ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ చేతిలో ఉందని సీఎం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి తెలంగాణకు నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి హితవు పలికారు. కేంద్రం నిధులు మంజూరు చేయనంత మాత్రాన రాష్ట్రంలో అభివృద్ధి పనులు నిలిచి పోవని, ఏపని ఎలా పూర్తిచేయాలో కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద ప్రణాళిక సిద్ధంగా ఉందని అన్నారు. ఈ దేశాన్ని యాభై ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీకి ఎన్నో విపత్కర పరిస్థితుల నుండి దేశాన్ని గట్టెక్కించిన ఘన చరిత్ర ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

### కేంద్రమంత్రులు కట్టుబానిసలు



తెలంగాణ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ప్రధాని నరేంద్రమోదీకి కట్టుబానిసలని సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం ఢిల్లీ నుండి నిధులు తెస్తామని ప్రగల్భాలు పలికిన ఆ ఇద్దరు మంత్రులు బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై ఏం సమాధానం చెప్తారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్రమంత్రులు బానిస మనస్తత్వాలను వదిలి పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. పదేళ్ల నుండి కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి తెలంగాణకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని, కేంద్రమంత్రి పదవికి తక్షణం రాజీనామా చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ నుండి బీజేపీ ఎంపీలుగా గెలిచిన ఎనిమిది మందీ రాష్ట్ర ప్రజలకు ప్రధాని మోదీ చేసిన అన్యాయంపై వివరణ ఇచ్చి తీరాలని సీఎం రేవంత్‌రెడ్డి పట్టుబట్టారు. ఇప్పటి కైనా బీజేపీ ఎంపీలు బానిసల్లాగా ఆలోచించవద్దని, రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్రాన్ని నిలదీయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. కేంద్ర ప్రభుత్వం కనుక తెలంగాణపై ఇదే విధమైన కక్ష పూరిత వైఖరిని కొనసాగిస్తే మరో ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు. ప్రధాని మోదీ దేశాన్ని ఆంధ్రప్రదేశ్, బిహార్‌కు తాకట్టు పెట్టారని సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు, బిహార్‌కు నిధులు ఎందుకు ఇచ్చారని తాము ప్రశ్నించడం లేదని, ఆ రాష్ట్రాలకు చేసిన కేటాయింపులకు వ్యతిరేకం కూడా కాదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కేవలం తెలంగాణకు నిధులు ఎందుకు కేటాయించలేదని మాత్రమే ప్రశ్నిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

### సౌతిండియా సీఎంలతో సదస్సు

కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దక్షిణాదికి జరుగుతున్న అన్యాయాన్ని దేశ ప్రజల దృష్టికి తీసుకెళతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అందులో భాగంగా దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కర్నాటక ముఖ్యమంత్రికి సౌతిండియా సీఎం సదస్సుపై సమాచారం పంపామని సీఎం రేవంత్ వెల్లడించారు. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి ముఖ్యమంత్రులకు కూడా త్వరలో ఆహ్వానం పంపనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. దక్షిణాది ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని దేశ ప్రజల దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ముఖ్యమంత్రులపై ఉందని, సౌతిండియా ముఖ్యమంత్రులు కలిసికట్టుగా వ్యవహరించి కేంద్రం ప్రదర్శిస్తున్న ద్వంద్వ వైఖరిని గర్హించాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రెవిన్యూ మరియు గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఐటీశాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్ ,ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితర్లు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ అనే పదమే ఉచ్చరించలేదు

**మొదటి పేజీ తరువాయి...**

మంది బీజేపీ ఎంపీలు తెలంగాణ నుంచి గెలిచి ఏం ప్రయోజనమన్నారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఏదీ ,బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ లేదు.. తెలంగాణకు బీజేపీ తీరని అన్యాయం చేసిందన్నారు. తెలంగాణకు కేంద్రం ఇచ్చింది గుండు సున్నా అంటూ హరీశ్ రావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్‌పై ప్రభుత్వంపై హరీశ్ రావు విరుచుకుపడ్డారు. ఈ ప్రభుత్వం హామీల ఎగవేతనే కాదు ..అసెంబ్లీ సమయంపై ఎగవేత ధోరణి అవలంభిస్తోందని విమర్శించారు. బడ్జెట్ సమావేశాలు నాలుగు రోజుల్లో కుదిస్తున్నారని.. కనీసం 15 రోజులు సమావేశాలు జరపాలని డిమాండ్ చేశామన్నారు. డిమాండ్లపై రెండు రోజులే చర్చ జరపడం దారుణమన్నారు. గతంలో కేసీఆర్ హయాంలో తొమ్మిది రోజులు డిమాండ్ల పై చర్చ జరిగేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు అసెంబ్లీ సమావేశాల పని దినాలు పెంచాలన్న కాంగ్రెస్ ఇపుడు ఎం చేస్తోందని ప్రశ్నించారు. పాలక పక్షం దుర్మార్గంగా ప్రవర్తిస్తోందన్నారు. రేపటి ఎజెండా ఇంకా ఖరారు చేయలేదని.. ఈ సాయంత్రం రేపటి చర్చను నిర్ణయిస్తే సభ్యులు ఎలా సిద్ధమవుతారని అన్నారు. నిరుద్యోగుల అంశంపై రేపు చర్చా చేపట్టాలన్నామని.. తొమ్మిది అంశాలను చర్చకు ప్రతిపాదించామని హరీశ్ తెలిపారు. శాంతి భద్రతల వైఫల్యం ,చేనేత కార్మికుల ఆత్మహత్యలు ,గ్యారంటీలు చట్టబద్ధత ,రైతు రుణమాఫీ ఆంక్షలు ,అన్ని పంటలకు బోనస్ రైతు భరోసా ,పల్లె లు పట్టణాల్లో పారిశుధ్య లోపం స్థానిక సంస్థలకు నిధులు ,ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లింపులు, గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులకు పెండింగ్ బిల్లులు లాంటి తొమ్మిది అంశాలు చర్చను పెట్టాలని కోరామన్నారు.

# 9 ప్రాధాన్య అంశాల ఆధారంగా కేంద్ర బడ్జెట్

**మొదటి పేజీ తరువాయి...**

ఇస్తామని అన్నారు.

### విద్య, నైపుణ్యాభివృద్ధి - రూ.1.48 లక్షల కోట్లు

ఈసారి బడ్జెట్‌లో విద్య, నైపుణ్యాభివృద్ధి కోసం అధికంగా నిధులు కేటాయించారు. ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధికి రెండో ప్రాధాన్యత ఇస్తున్నామని.. ఇందు కోసం రూ.1.48 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.

### రైతులు, మహిళల కోసం

బడ్జెట్‌లో వ్యవసాయం, మహిళ, మౌలిక సదుపాయాల కల్పన కోసం నిర్మలమ్మ ఎక్కువగా ఫోకస్ పెట్టారు. వచ్చే రెండేళ్లలో కోటి మంది రైతులను సేంద్రీయ వ్యవసాయం దిశగా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. కూరగాయల ఉత్పత్తి పెద్దఎత్తున చేపట్టేలా క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. 5 రాష్ట్రాల్లో కిసాన్ క్రెడిట్ కార్డులు అందిస్తామన్నారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల అభివృద్ధికి రూ.1.5 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే, మహిళలు, బాలికల కోసం రూ.3 లక్షల కోట్లతో పథకాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. మౌలిక సదుపాయాల కల్పనకు రూ.11.11 లక్షల కోట్లు కేటాయించారు.

# అసెంబ్లీ సమావేశాల వేళ కేసీఆర్‌కు బిగ్ షాక్

**మొదటి పేజీ తరువాయి...**

ప్రస్తుతం 28 మంది ఎమ్మెల్యేలు మిగిలారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు.. దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ కండువా కప్పుకోగా.. ఎన్నికల తర్వాత.. ఒకరి తర్వాత ఒకరు మొత్తంగా 10 మంది ఎమ్మెల్యేలు హస్తం గూటికి చేరిపోయారు. ఇక.. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణంతో వచ్చిన ఉపఎన్నికల్లోనూ.. కాంగ్రెస్ అభ్యర్థే గెలుపొందటంతో.. ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 28కి చేరింది. మరోవైపు.. ఎమ్మెల్సీలు కూడా ఒకేసారి ఐదుగురు కాంగ్రెస్ కండువా కప్పుకుని షాకిచ్చారు. ఇక.. ఇప్పుడు ఐదుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు.. కీలకమైన ఎల్పీ మీటింగ్‌కు హాజరుకాకపోవటం సర్వత్రా అనుమానాలు తావిస్తోంది. హాజరుకాని వాళ్లలో.. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్య రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీలు చల్లా వెంకటరామిరెడ్డి, గోరేటి వెంకన్న, వెంకట్రామి రెడ్డి ఉన్నారు. అయితే.. ఇందులో చాలా మంది కేసీఆర్‌కు విధేయులుగా ఉన్నవారే ఉన్నప్పటికీ.. గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో.. అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసీఆర్‌కు ఎంతో నమ్మకంగా ఉన్నవాళ్లే పార్టీని వీడుతుండటంతో.. ఇప్పుడు ఏ ఒక్కరిని నమ్మే పరిస్థితి లేదన్న చర్చ నడుస్తోంది. మరోవైపు.. ఇందులో కొందరు ఎమ్మెల్యేలు పార్టీ మారబోతున్నట్లు గత కొంత కాలంగా చర్చనడుస్తోంది. దీంతో.. వీళ్లు కూడా కారు దిగి.. హస్తంతో దోస్తీకి సిద్ధమయ్యారా.. అన్న అనుమానం వ్యక్తమవుతోంది. ఇలా కీలకమైన మీటింగ్‌కు డుమ్మా కొట్టి గులాబీ బాస్‌కు సంకేతాలు పంపించారా.. లేదా ఏదైనా అనివార్య కారణాల వల్లే హాజరుకాలేకపోయారా అన్నది తెలియాల్సి ఉంది.

# తగ్గనున్న బంగారం, వెండి, మొబైల్ ఫోన్ల ధరలు




న్యూఢిల్లీ, జులై 23 (ప్రభాత ఉదయం): బంగారం, వెండితో పాటు మొబైల్ ఫోన్ల ధరలు కూడా తగ్గనున్నాయి. మొబైల్ ఫోన్లు, మొబైల్ సంబంధిత విడి విభాగాలపై కస్టమ్ డ్యూటీని 15 శాతం తగ్గిస్తున్నట్లు మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆమె మాట్లాడుతూ.. బంగారం, వెండిపైన కస్టమ్స్ సుంకాన్ని ఆరు శాతం తగ్గిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ-కామర్స్‌పై టీడీఎస్‌ను కూడా తగ్గించారు. ఆరు నెలల్లో కస్టమ్స్ సుంకం విధానాన్ని సమగ్రంగా సమీక్షించాలని నిర్ణయించినట్లు మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. 1961 నాటి ఆదాయ పన్ను చట్టాన్ని కూడా సమగ్రంగా రివ్యూ చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు.

# ముద్రా రుణాల పరిమితి 20 లక్షలకు పెంపు

న్యూఢిల్లీ, జులై 23 (ప్రభాత ఉదయం): చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు క్రెడిట్ సపోర్టును ప్రకటించారు మంత్రి సీతారామన్. ముద్రా రుణాల పరిమితిని పది లక్షల నుంచి 20 లక్షల వరకు పెంచుతున్నట్లు ఆమె చెప్పారు. లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆమె మాట్లాడుతూ విజయవంతంగా రుణాలను చెల్లించిన వారికి పరిమితిని పెంచుతున్నట్లు ఆమె తెలిపారు. తరుణ్ క్యాటగిరీలో ఈ వెసలుబాటు కల్పించనున్నారు. ఎంఎస్ఎంఈలకు టర్మ్ లోన్ కల్పించేందుకు.. కొత్త రకం క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్‌ను ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి తెలిపారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ గ్యారెంటీ ఫండ్ కింద ప్రతి ఖాతాదారుడికి వంద కోట్ల వరకు రుణం ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఇర్రాడియేషన్ యూనిట్ల ఏర్పాటుకు ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ కామర్స్ ఎక్స్‌పోర్ట్ హబ్స్ ను పీపీపీ మోడల్‌లో ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

# ఏపీకి వరాల జల్లు.. తెలంగాణకు మొండిచేయి

### కేంద్ర బడ్జెట్‌లోని ముఖ్యాంశాలు

న్యూఢిల్లీ, జులై 23 (ప్రభాత ఉదయం): ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తి స్థాయి బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్ సభలో ప్రవేశ పెట్టారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన 8 నెలల కాలానికి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్మలమ్మ తాత్కాలిక బడ్జెట్ ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. ఇక కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రశపెట్టడం నిర్మలా సీతారామన్‌కు ఇది వరుసగా ఆరోసారి కావడం విశేషం. ఇక ఈ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం వరాల జల్లు కురిపించింది. అయితే, తెలంగాణ రాష్ట్రానికి మాత్రం మొండి చేయి చూపించింది. మరి ఈ బడ్జెట్ ముఖ్యాంశాలు ఏంటో ఇప్పుడు చూద్దాం..

### బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు..

**తొమ్మిది సూత్రాల ఆధారంగా బడ్జెట్ రూపకల్పన.**

- వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన, ఆవిష్కరణలు, తయారీ, సేవలు, తర్వాతతరం సంస్కరణలు.. ఈ తొమ్మిది సూత్రాల ఆధారంగా బడ్జెట్ రూపకల్పన.
- 2024-25 బడ్జెట్ అంచనాలు రూ.48.21 లక్షల కోట్లు.
- జీడీపీలో 4.9 శాతంగా ఉండనున్న ద్రవ్యలోటు.
- వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, సుస్థిరత సాధన లక్ష్యంగా చర్యలు.
- ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధికి రెండో ప్రాధాన్యం.
- కూరగాయల ఉత్పత్తికి త్వరలో మెగా క్లస్టర్ల ఏర్పాటు. పప్పు ధాన్యాలు, నూనె గింజల్లో స్వయం సమృద్ధి సాధనకు చర్యలు.
- సహకార రంగాన్ని సుస్థిరం చేసేందుకు నిర్మాణాత్మక విధానాల రూకపల్పన.
- వినియోగం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు సమీపంలో కూరగాయల ఉత్పత్తి క్లస్టర్ల ఏర్పాటు. సేకరణ, సరఫరా, నిల్వకు అవసరమైన పెట్టుబడులను అందుబాటులోకి తేవడం లక్ష్యం.
- దేశీయ విద్యాసంస్థల్లో ఉన్నత విద్య కోసం విద్యార్థులకు రూ.10లక్షల వరకు రుణాలు
- వచ్చే ఐదేండ్లలో నైపుణ్యాభివృద్ధి సంస్థల ఏర్పాటు.
- కొత్త ఉద్యోగాల కల్పనలో తొలి నెల వేతనం ప్రభుత్వం చెల్లిస్తుంది. కొత్త ఉద్యోగులకు ఈపీఎఫ్ఓ చెల్లింపుల్లో నాలుగేండ్ల పాటు ప్రోత్సాహకాలు.
- ఎంప్లాయిమెంట్ ఇన్సెంటివ్‌ల కోసం మూడు పథకాలు.
- అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల సాయం.. అవసరాన్ని బట్టి మరిన్ని నిధులు
- పోలవరానికి పెద్దపీట.. త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి.
- రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు
- విశాఖ-చెన్నై కారిడార్‌లో కొప్పర్తికి, హైదరాబాద్ - బెంగళూరు కారిడార్‌లో ఓర్వకల్లుకు నిధులు.
- బీహార్ రాష్ట్రానికి ఆర్థిక సాయం. బహుపాక్షిక అభివృద్ధి ఏజెన్సీల నిధుల ద్వారా ఆర్థిక సాయం. బీహార్‌లో వంతెనల నిర్మాణానికి రూ.26 వేల కోట్లు.
- వరద నివారణకు బీహార్‌కు రూ.11 వేల కోట్లు.
- బీహార్, జారండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో దేవాలయ సాంస్కృతిక పరిరక్షణకు చర్యలు.
- గ్రామీణ అభివృద్ధికి రూ.2.66 లక్షల కోట్ల కేటాయింపు.
- ముద్ర రుణాలు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంపు.
- 500 పెద్ద కంపెనీల్లో కోటి మందికి ఉద్యోగ కల్పన.
- వంద నగరాల్లో ప్లగ్ అండ్ ప్లే తరహాలో పారిశ్రామిక పార్కులు.
- 12 విస్తృతస్థాయి పారిశ్రామిక అభివృద్ధి కేంద్రాల ఏర్పాటు.
- పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేసే కార్మికుల కోసం అద్దె గృహాల నిర్మాణం.
- పీపీపీ విధానంలో డార్మిటరీ తరహా ఇళ్ల నిర్మాణం.
- రాష్ట్రాల మౌలిక వసతుల కల్పనకు రూ.1.5 లక్షల కోట్ల వడ్డీలేని రుణాలు.
- ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద కొత్తగా దేశవ్యాప్తంగా మూడు కోట్ల ఇండ్ల నిర్మాణం.
- అఫ్ షోర్ మైనింగ్ కోసం కొత్త విధానం.
- దేశవ్యాప్తంగా అన్ని పంటలకు మద్దతు ధరలు. కనీసం 50 శాతం మిగులు ఉండేలా మద్దతు ధరల పెంపు.
- వాతావరణ మార్పులకు అనుగుణంగా కొత్తగా తొమ్మిది వంగడాల తయారీ. వేరు శనగ, పొద్దు తిరుగుడు పువ్వుల ఉత్పత్తి పెంపునకు చర్యలు.
- స్టాంప్ డ్యూటీ పెంచుకునేందుకు రాష్ట్రాలకు అనుమతి. మహిళల ఆస్తుల రిజిస్ట్రేషన్‌పై స్టాంప్ డ్యూటీ తగ్గింపు.
- మినరల్ మిషన్ ద్వారా ఖనిజాల గుర్తింపు, ఎగుమతులకు ప్రత్యేక విధానం.
- సాగర గర్భంలో ఖనిజాల అన్వేషణకు కొత్త ప్రణాళిక.
- 3.1 శాతానికి పరిమితమైన ఆహార, ఆహారేతర ద్రవ్యోల్బణం.
- పారిశ్రామిక వివాదాల పరిష్కారానికి కొత్త ట్రిబ్యునళ్లు.
- రుణ వసూళ్లకు ప్రత్యేక ట్రిబ్యునళ్ల ఏర్పాటు.
- మహానగరాల పునర్ నిర్మాణానికి కొత్త ప్రణాళిక.
- మహానగరాలకు అనుబంధంగా హరిత నగరాల ఏర్పాటు.
- నగర వ్యర్థ జలాల శుద్ధితో వ్యవసాయ అవసరాలకు నీరు.
- నాలుగు శాతానికి ద్రవ్యోల్బణాన్ని పరిమితం చేయడమే ప్రభుత్వ లక్ష్యం.
- ఇప్పటికే విస్తరించిన నగరాల అభివృద్ధికి సృజనాత్మక ప్రణాళిక.
- పీఎం ఆవాస్ యోజన (అర్బన్) కింద కోటి మందికి లబ్ధి. రూ. 10 లక్షల కోట్ల నిధులు
- మహిళలు, బాలికల సాధికారత కోసం రూ.3 లక్షల కోట్లు.
- పట్టణ, నగరాల్లో పేద, మధ్య తరగతి ఇండ్ల నిర్మాణానికి నిధుల కేటాయింపు.
- అసోంలో వరదల నియంత్రణ కొత్త పథకాలకు కేంద్రం ఆమోదం.
- GST కారణంగా సామాన్యులపై పన్నుల భారం తగ్గింది.
- మరింత సరళంగా, హేతుబద్ధంగా GST మార్పు.
- 25 రకాల కీలక ఖనిజాలపై కస్టమ్ డ్యూటీ తగ్గింపు.
- 3 రకాల క్యాన్సర్ మందులపై కస్టమ్స్ డ్యూటీ తగ్గింపు.
- ఎక్స్‌రే మెషీన్లపై జీఎస్టీ తగ్గింపు.
- సోలార్ ఉత్పత్తులపై కస్టమ్ డ్యూటీ తగ్గింపు.
- మొబైల్స్, మొబైల్స్ పరికరాలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ 15 శాతానికి తగ్గింపు.
- బంగారం, వెండి, ప్లాటినంపై కస్టమ్స్ డ్యూటీ తగ్గింపు.
- లెదర్ ఉత్పత్తులపై పన్ను శాతం తగ్గింపు

# కుర్సీ బచావో బడ్జెట్..

## నిర్మలమ్మ బడ్జెట్‌పై రాహుల్ పెదవి విరుపు



న్యూఢిల్లీ, జులై 23 (ప్రభాత ఉదయం): ప్రస్తుత ఆర్థిక సంవత్సరా (2024-25)నికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ పెదవి విరిచారు. నిర్మలా సీతారామన్ పార్లమెంట్ కు బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించిన తర్వాత లోక్ సభ వాయిదా పడింది. నిర్మలా సీతారామన్ బడ్జెట్ 'కేవలం అధికార పీఠాన్ని కాపాడుకునేందుకు ప్రవేశ పెట్టిన బడ్జెట్ (కుర్సీ బచావో బడ్జెట్) అని 'ఎక్స్ (మాజీ ట్విట్టర్)' వేదికగా పోస్ట్ చేశారు. బీజేపీ తన మిత్ర పక్షాలను బుజ్జగించేందుకు బూటకపు హామీలు గుప్పించి, ఇతర రాష్ట్రాలకు మొండి చేయి చూపిందని ఆరోపించారు. గత బడ్జెట్లు, కాంగ్రెస్ పార్టీ 2024 లోక్ సభ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ముఖ్యాంశాలను అరువు తెచ్చుకుని 'కాపీ అండ్ పేస్ట్' బడ్జెట్ ను నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టారని ఎద్దేవా చేశారు.

# ఇది కేవలం అధికారాన్ని కాపాడుకునే బడ్జెట్: ఖర్గే



న్యూఢిల్లీ, జులై 23 (ప్రభాత ఉదయం): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రతిపక్షాలు పెదవి విరుస్తున్నాయి. ఈ కేంద్ర బడ్జెట్‌తో సామాన్యులకు ఒరిగేదేమీ లేదని విమర్శలు చేస్తున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా కేంద్ర బడ్జెట్‌పై స్పందించారు. తాజా బడ్జెట్ తనను తీవ్ర నిరాశకు గురిచేసిందని అన్నారు. 'ఈ బడ్జెట్ ఒక నిరుత్సాహపర్చే బడ్జెట్. ఇది కేవలం అధికార పీఠాన్ని కాపాడుకునే బడ్జెట్. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర, ఎరువులపై రాయితీకి సంబంధించి ఈ బడ్జెట్‌లో ప్రకటన చేస్తారని మేం ఆశించాం. కానీ ప్రభుత్వం ఆ ప్రస్తావనే తీసుకురాలేదు. ఈ మధ్య కాలంలో రైల్వే ప్రమాదాలు బాగా పెరిగిపోయాయి. కానీ రైల్వే ట్రాక్‌లను మెరుగుపర్చడంపైగానీ, రైల్వే ప్రయాణికుల భద్రతపైగానీ ప్రభుత్వం దృష్టి సారించకపోవడం దురదృష్టకరం' అని ఖర్గే వ్యాఖ్యానించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో ప్రధాన మిత్రపక్షాలైన జేడీయూ, టీడీపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు మాత్రమే కేంద్రం భారీగా కేటాయింపులు చేసింది. గత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు 8 మంది బీజేపీ అభ్యర్థులను ఎంపీలుగా గెలిపించినా బడ్జెట్‌లో తెలంగాణ ఊసే లేకపోవడం గమనార్హం.

# రాజకీయ పక్షపాత బడ్జెట్ : మమతాబెనర్జీ



న్యూఢిల్లీ, జులై 23 (ప్రభాత ఉదయం): కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జి తీవ్ర విమర్శలు చేశారు. ఈ బడ్జెట్ పూర్తిగా రాజకీయ పక్షపాత వైఖరితో కూడిన బడ్జెట్ అని ఆమె మండిపడ్డారు. ఈ బడ్జెట్‌కు ఒక దిక్కూదివానం లేదని, ఇది కేవలం పొలిటికల్ మిషన్ అని మమత ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ బడ్జెట్ సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని వాళ్లు (బీజేపీ నేతలు) చెప్పుకుంటున్నారని, కానీ ఇది పూర్తిగా అంధకార బడ్జెట్ అని మమత విమర్శించారు. ఎన్నికల సందర్భంగా వాళ్లు (బీజేపీ నేతలు) చాలా పొడుగులు మాట్లాడుతారని, ఒక్కసారి ఓట్లు పడ్డాయంటే వాళ్లు అన్నీ మర్చిపోతారని ఆమె ఫైరయ్యారు. డార్జిలింగ్, కలింపాంగ్ ప్రజలకు అధికార బీజేపీ ద్రోహం చేసిందని మండిపడ్డారు. ఈ బడ్జెట్ సామాన్యులకు ఉపయోగపడే బడ్జెట్ కాదని, ఇది ప్రజా వ్యతిరేక, పేదల వ్యతిరేక బడ్జెట్ అని మమతాబెనర్జి విమర్శించారు. ఈ బడ్జెట్ కేవలం ఒక పార్టీకి మాత్రమే లబ్ధి చేకూర్చేలా ఉన్నదని, రాజకీయ పక్షపాతంతో అవసరమైన చోట అధిక కేటాయింపులు చేశారని, ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు మొండి చేయి చూపించారని విమర్శించారు.

# వరుస చైన్ స్నాచింగ్లకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులు అరెస్ట్





## 15 తులాల బంగారం స్వాధీనం

రాజేంద్రనగర్,జులై 23 (ప్రభాత ఉదయం): పోలీసులకు చిక్కకుండ మూడు సంవత్సరాలుగా చైన్ స్నాచింగ్లకు పాల్పడుతున్న ముఠా సభ్యులను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం రాజేంద్రనగర్ జోన్ డిసిపి కార్యాలయంలో డిసిపి చింతమనేని శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు.రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుద్వేల్ బస్ స్టాప్ వద్ద ఈనెల 16వ తేదీన మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును ఇద్దరు నిందితులు అపహరించుకు పోయారు.కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు మూడు సంవత్సరాల నుండి వరుసగా చైన్ స్నాచింగ్ జరుగుతున్న బుద్వేల్ బస్ స్టాప్ పై ఓ కన్నేసి ఉంచారు.చైన్లు స్నాచింగ్ చేస్తున్న వ్యక్తులను క్రైమ్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ గంగాధర్ క్రైమ్ కానిస్టేబుల్ వసంత్ కుమార్ తనదైన శైలిలో నిందితులను పట్టుకున్నారని తెలిపారు.సీసీ కెమెరాలతో పాటు బస్సు నెంబర్ కనిపెట్టిన తర్వాత ఇన్వెస్టిగేషన్ మొదలుపెట్టారని అన్నారు.నాగర్ కర్నూలు జిల్లా పులిగిరి విలేజ్ తిమ్మాపూర్ మండల్ కు చెందిన ముదవత్ పాండు (35),ముదవత్ సేవియా (23) వీరు ఇద్దరు దాదాపుగా మూడు సంవత్సరాల నుండి బుద్వేల్ బస్ స్టాప్ లో బస్సు కోసం ఆగి ఉన్న మహిళలని టార్గెట్ చేస్తూ రాత్రి చీకటి పడగానే మహిళా మెడల నుంచి చైన్స్ స్నాచింగ్ చేసిన వెంటనే యూనివర్సిటీ గోడ లోపలికి దూకి అక్కడి నుండి ఆరాంఘర్ వైపుగా వెళుతున్న వాహనాలు ఎక్కి పారిపోయే వారని తెలిపారు.మూడు సంవత్సరాల నుండి పోలీసులకు ఎలాంటి ఆధారాలు లేకుండా ఈ చైన్ స్నాచింగ్ పాల్పడుతున్నారు.రాజేంద్రనగర్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ గంగాధర్ గత మూడు సంవత్సరాలుగా వరుసగా చైన్ స్నాచింగ్ జరుగుతుండడంతో ఎలా అయినా ఈ కేసును చేదించాలని స్నాచింగ్ అయిన రోజు నుంచి వరుసగా మూడు రోజులు పోలీసులు కునుకు లేకుండా ఆధారాలను సేకరించారు.వీరిని అదుపులోకి తీసుకున్న తర్వాత వీరి దగ్గర నుండి దాదాపుగా ఆరు చైన్లు 11 లక్షల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.నిందితులు ఇద్దరినీ రిమాండ్ కు తరలించినట్టు తెలిపారు. స్నాచర్లను పట్టుకోవడంలో కష్టపడి పని చేసిన డిఐ గంగాధర్ తో పాటు క్రైమ్ కానిస్టేబుల్ వసంత్ లను డిసిపి చింతమనేని శ్రీనివాస్ అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏసీపి శ్రీనివాస్, డిఐ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

### పోలీసులకు మహిళల కృతజ్ఞతలు...

చైన్ స్నాచింగ్ జరిగి మూడు సంవత్సరాల అవుతుంది.మావద్ద దొంగిలించిన బంగారం తిరిగి తమకు లభింస్తుందన్న ఆశను సైతం కోల్పోయామని.కానీ పోలీసులు మూడు సంవత్సరాలు క్రితం కోల్పోయిన తమ బంగారాన్ని ఇప్పించారని మహిళలు తెలిపారు. మహిళలు తిరిగి వారి బంగారాన్ని రికవరీ చేసిన పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణకు బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం

**తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి) రాష్ట్ర సమితి**

**తెలంగాణ ప్రజలు కార్మికులు బిజెపికి ఓట్లు వేసి ఎనిమిది మందిని పార్లమెంటుకు పంపిస్తే కేంద్రం బడ్జెట్ లో మనకు నిధులు కేటాయించలేదు**

**ప్రభుత్వ రంగాల ప్రస్తావన లేకుండా నిరుద్యోగం పేదరికాన్ని పెంచేందుకు ప్రైవేట్ వ్యాపార రంగాల అభివద్ధి బడ్జెట్ రూపొందించారు.**

**ప్రజలు వినియోగదారులకు ధరలు, పన్నులు తగ్గించకుండా వ్యాపార ఉత్పత్తి దారులకు తగ్గించారు**

**రైతులకు మద్దతు ధరలు ఇవ్వలేక గాలికి వదిలేశారు**

**30కోట్ల అసంఘటిత రంగ కార్మికులను పట్టించుకోలేదు**

**80 కోట్ల సామన్య ప్రజలకు బాధలు పట్టించుకోకుండా ధరలు తగ్గించలేదు**



రాజేంద్రనగర్, జూలై 23(ప్రభాత ఉదయం) కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు మొండి చేయి చూపిందని మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మంగళవారం కేంద్ర బడ్జెట్ పై ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ప్రజలు పార్లమెంటు ఎన్నికల్లో బిజెపికి ఓట్లేసినా కేంద్ర ప్రభుత్వం మాత్రం రాష్ట్రానికి బడ్జెట్ లో నిధులు ఇవ్వకపోవడం వివక్షతో పాటు చిన్న చూపు చూసిందన్నారు. మాచర్ల గద్వాల రైల్వే నిర్మాణం,నవోదయ విద్యాసంస్థలు ఏర్పాటు వంటి వాటికి నిధులు ఇవ్వలేదని తెలంగాణ విభజన చట్టంలో ఉన్న బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ పరిశ్రమ ,గిరిజన యూనివర్సిటీకి, మెడికల్ కాలేజీ ఏర్పాటుకు అలాగే ఇతర తెలంగాణకు ప్రత్యేక నిధులు ఏవి అని ప్రశ్నించారు.. ఎన్నికల ముందు ప్రధానమంత్రి పలు ఎన్నికల సభల్లో బిజెపి మళ్లీ దేశంలో అధికారంలోకి వస్తే తెలంగాణకు అన్ని విధాలుగా బడ్జెట్ లో ఆదుకుంటామని గొప్పలు చెప్పి ఓట్లు దండుకొని నేడు అధికారంలోకి వచ్చి తెలంగాణకు మొండి చేయి చూపెట్టడం బాధాకరమని అన్నారు.. అన్ని రంగాల్లో బడ్జెట్ తెలంగాణకు మోసం చేసిందన్నారు. తెలంగాణకు ఇంత అన్యాయం జరుగుతుంటే మాట్లాడని బిజెపి తెలంగాణ ఎంపీలు వీరికి పదవులు ఎందుకు ఇంత అన్యాయం జరుగుతుంటే రాజీనామా చేసి ఢిల్లీలో కొట్లాడాలని అన్నారు బిజెపి ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా తెలంగాణకు నిరాశపరిచిందని, తెలంగాణ అంటే శత్రువుగా మోడీ బీజేపీ ప్రభుత్వం రాజకీయ కారణాలను చూడటం దుర్మార్గం అన్నారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం నిర్మూలిం చడానికి ఎలాంటి ప్రతిపాదన ఈ బడ్జెట్లో లేదు, ప్రభుత్వ రంగాల ఏర్పాటు పరిశ్రమల రక్షణ, కొత్తగా నిర్మాణం వంటి ప్రయత్నాలు ఏమి చేయలేదంటే దీని అర్థం దేశాన్ని మొత్తం బడ వ్యాపారుల కోసం వారి చేతుల్లోకి పరిశ్రమలను నెట్టి వారికి మాత్రమే ఈ బడ్జెట్ లో రాయితీలు ఇచ్చే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ రంగంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేది లేదన్నట్లు ప్రైవేట్ ఉత్పత్తులకు రాయి తీలు ఇచ్చారు , ప్రభుత్వరంగ పరిశ్రమల కు,సామాన్యులకు,వినియోగదారులకు ఎలాంటి ఉపయోగకరమైన ప్రతిపాదనలు, ధరల తగ్గింపు ఈ బడ్జెట్ లో లేవన్నారు. 500పెద్ద ప్రైవేట్ కంపెనీల్లో కోటి ఉద్యోగాలు కల్పిస్తామని నిర్మల సీతారామన్ ప్రకటించడం దీనికి అద్దం పడుతుందన్నారు. 30కోట్ల అసంఘటిత కార్మికులను,80కోట్ల సామాన్య ప్రజలను గాలికొదిలేసి 2047కల్ల వికసిత భారత్ అని ప్రకటించడమంటే ఇది ప్రైవేట్ శక్తులకు మాత్రమే అన్నట్లుందని పేర్కొన్నారు. 5ఏళ్లుగా ధర్నాలు చేసిన రైతులకు మద్దతు ధరలు ఎంతఇస్తారో చెప్పకుండా మాటలకే పరిమితం చేసి తప్పించుకున్నారని ఎద్దేవా చేశారు. ఇలా మొత్తం బడ్జెట్ సామాన్యుల వ్యతిరేక, వ్యాపారుల అనుకూల బడ్జెట్ ఉందని జైపాల్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణకు బడ్జెట్ తీరని అన్యాయం చేసిందన్నారు.



# భవానికాలనీలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు**

రాజేంద్రనగర్,జులై 23(ప్రభాత ఉదయం): మైలార్ దేవులపల్లి డివిజన్ భవానికాలనీలో నూతనంగా ఎన్నికైన వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ను ఆయన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన కమిటీ ఎమ్మెల్యేను శాలువతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ నూతన కమిటీని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...భవాని కాలనీ అభివృద్ధికి వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు వారధిగా నిలవాలని సూచించారు.నూతన కమిటీ సభ్యులు కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు అయినప్పుడే కాలనీ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. భవాని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని,ఏ సమస్య అయినా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు.నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులు,కాలనీ వాసులందరికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ కాలనీ సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరు సమిష్టిగా కలిసి కాలనీ అభివృద్ధికి పాటుపడాలని, అప్పుడే ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దటానికి వీలవుతుందన్నారు.ఎ మ్మెల్యేను మర్యాదపురం కలిసిన వారిలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి అక్కెం కృష్ణ యాదవ్,వైస్ ప్రెసిడెంట్ సతీష్ కుమార్,కోశాధికారి మమ్మద్ ఇజాజ్,సహాయ కార్యదర్శి జి.శ్రీనివాస్ యాదవ్,ప్రచార కార్యదర్శి బండి నరోత్తం రెడ్డి,ఎలక్షన్ కమిటీ సభ్యులు రామారావు,మోహన్,తదితరులు ఉన్నారు.



బదిలీ అయిన జలమండలి డిజిఎం జమీల్, మేనేజర్ నరసింహారెడ్డిలను సన్మానిస్తున్న జిఎం సాయి లక్ష్మి, అధికారులు

# జలమండలి డీజీఎం, మేనేజర్ బదిలీ

**బదిలీ అయిన డీజీఎం జమీల్, మేనేజర్ నరసింహారెడ్డిలకు సన్మానం**

రాజేంద్రనగర్, జూలై 23(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ జమిల్ అల్తాఫ్ హుస్సేన్, మేనేజర్ రామ్ నర్సింహారెడ్డి ల వీడ్కోలు సమావేశాన్ని మంగళవారం బుద్వేర్ లోని జలమండలి కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనరల్ మేనేజర్ సాయి లక్ష్మి హాజరయ్యారు ఈ సందర్భంగా తోటి ఉద్యోగులు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు జమీల్ సాహెబ్ నగర్ లోని ట్రాన్స్మిషన్ కు బదిలీ కాగా రామ్ నర్సింహారెడ్డి పెద్ద అంబర్పేట్ జలమండలి కార్యాలయానికి బదిలీ అయ్యారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు పెండ్యాల శ్రీధర్ మేనేజర్లు పి వినాయక్ శ్రావ్య రెడ్డి సాయి రెడ్డి అబ్దుల్ ఖాదర్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు

# విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలి

**కంచ లేకపోవడంతో ప్రమాదాల గురవుతున్న ప్రజలు**



ఏఈ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు కురుమయ్య

రాజేంద్రనగర్, జూలై 23(ప్రభాత ఉదయం) విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ల చుట్టూ ప్రమాదాలు జరగకుండా కంచె ఏర్పాటు చేయాలని సిపిఎం రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జి కురుమయ్య విద్యుత్ శాఖ అధికారులను కోరారు. మంగళవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ డివిజన్ విద్యుత్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ కు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల చుట్టూ కంచలేకపోవటం వల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, చెత్త గడ్డి లను తొలగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి జి ఎం కురుమయ్య. పార్టీ మండల కమిటీ సభ్యులు ఎస్ మోహన్. కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం జిఎం కురుమయ్య మాట్లాడుతూ... రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలో గల ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ ప్రమాదాలు జరగకుండా కవచాలు ఏర్పాటు చేయాలని కోరారు. కరెంట్ లోపలికి వెళ్లిన చెట్లను. తొలగించి. ప్రజలకు రక్షణ కల్పించాలని. విద్యుత్ అధికారులను కోరడమైనది . విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్ ల చుట్టూ ఎలాంటి రక్షణ లేకుండా ఉండటం వలన చిన్నపిల్లలు, మూగజీవాలు, ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. విద్యుత్ వైర్లలోకి చెట్ల కొమ్మలు పెరిగి వైర్లలోకి . వెళ్లడంతో. కరెంటు షాక్ తదితరాలు జరగడానికి. అవకాశాలు ఉన్నాయి కనుక వైర్లలో వెళ్లిన చెట్లను కట్ చేసి . ప్రజల మానప్రాణాలకు రక్షణ కల్పించాలని. కోరారు. ఈ కార్యక్రమంలోజిఎం కురుమయ్యతోపాటు, ఎస్ మోహన్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ అధికారులు శ్రీనివాస మాట్లాడుతూ పై అధికారి రత్నాకరావు దృష్టికి తీసుకెళ్లి జాగ్రత్తలు తీసుకుంటామని విద్యుత్ అధికారి హామీ ఇచ్చారు.



# మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుని మర్యాదపూర్వకంగా కలిసిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్,జులై 23(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర శాసన సభ వ్యవహారాలు, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ఆయన స్వగృహంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మంత్రిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి ఘనంగా సత్కరించారు.అనంతరం మంత్రితో ఎమ్మెల్యే భేటీ రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధిపై చర్చించారు.నియోజకవర్గ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గ అభివద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మంత్రికి వినిపించారు.



# అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

రాజేంద్రనగర్,జులై 23 (ప్రభాత ఉదయం): అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించే ప్రీస్కూల్ కార్యక్రమాలపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మజా అన్నారు. అమ్మ మాట–అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి సెక్టార్ బాబుల్ రెడ్డినగర్ లో అనిత టీచర్ అంగన్వాడీ కేంద్రం,మాధవి టీచర్ అంగన్వాడీ కేంద్రంలో అక్షర బ్యాసం మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ... అంగన్వాడీలో ఎలాంటి ఒత్తిడి లేకుండా చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నామని, అంగన్వాడి కేంద్రాలను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సరస్వతిదేవి పూజ కార్యక్రమం నిర్వహించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారన్నారు. చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాలలో పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందించడం జరుగుతుందని తెలిపారు.అంగన్వాడీ కేంద్రాలలో ఆహ్లాదకరంగా ఆటపాటలతో చక్కని విద్యను అందించే అంగన్వాడీ కేంద్రాలలో 2.5 నుండి 5 సంవత్సరాలలోపు పిల్లలను చేర్పించాలని కోరారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని తల్లిదండ్రులు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. అనంతరం అక్షరాభ్యాసం చేయించిన చిన్నారులతో అక్షరాలను దిద్దించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు అనిత,అంగన్వాడీ టీచర్ కనకవ్వ,అనిత,మాధవి, ఆర్పీ హేమలత,ఆశ వర్కర్ లక్ష్మి,రేణుక, మంగ, మణెమ్మ,సునీతశర్మ,సంగీత,ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ ఆలయ స్థలంలో ఉన్న కల్లు కంపౌండ్‌ను తొలగించాలి

శంషాబాద్,జులై 23(ప్రభాత ఉదయం) శంషాబాద్ పట్టణంలోని ఎయిర్ పోర్ట్ కాలనీ సర్వేనంబరు 626 లోని పోచమ్మ దేవాయలయానికి సంబంధించిన 200 గజాల స్థలంలో అక్రమంగా కొనసాగుతున్న కల్లుకంపౌండ్ ను వెంటనే తొలగించాలని కాలనీ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు.బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడు బూడిద బిక్షపతి సభ్యులు బూడిద శివ తదితరులు మాట్లాడుతూ.. ఎక్సైజ్ నిబంధనలకు విరుద్ధంగా దేవాలయానికి కేవలం ఇరవై మీటర్ల పరిధిలోనే కల్లుకంపౌండ్ కొనసాగుతుండడంతో మహిళలు,భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఆలయ స్థలంలో ఉన్న కంపౌండ్ను తొలగిస్తామని గతంలో చెప్పిన యజమానులు ప్రస్తుతం పట్టించుకోవడంలేదన్నారు. విక్రయదారులు గుడి స్థలం కాకుండా పక్కనే ఏర్పాటు చేసుకున్న ప్రత్యామ్నాయ స్థలంలోపాటు ఆలయ స్థలంలో యధాతథంగా అమ్మకాలు జరుపుతున్నారన్నారు.కంపౌండ్ యజమానులు స్వచ్ఛందంగా తొలగించకపోతే జిల్లా కలెక్టర్,ఎక్సైజ్ సూపరిండెంట్,డీసీపీలను కాలనీ ప్రజలంతా కలిసి న్యాయం చేయాల్సిందిగా విన్నవించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో మేకల జంగయ్య, చల్లా గాల్ రెడ్డి తదితరులున్నారు.



# అధ్వాన దారులు.. అవస్థల ప్రయాణాలు

## చోదకులకు ఒళ్లు నొప్పులు మరమ్మతుకు గురవుతున్న వాహనాలు



గుంతలమయంగా మారిన గద్వాల అయిజ రోడ్డు..



బురద మయంగా మారిన ధరూర్ మండల కేంద్రం..



చింతరేవుల వద్ద

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 23(ప్రభాత ఉదయం)అవి దారులు కాదు.. నరకానికి నకళ్లు అని జిల్లా ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ఏ రోడ్డు చూసినా అడుగడుగునా పెద్ద పెద్ద గుంతలు.. వాటిపై ప్రయాణమంటే ప్రమాదం వైపు పయనమే. జిల్లాలో రహదారులు, భవనాలశాఖ ప్రధాన రోడ్లతో పాటు పల్లెలకు అనుసంధానంగా ఉన్న పంచాయతీరాజ్ రోడ్లు అధ్వానంగా మారాయి. తెలంగాణ కర్ణాటక, ఏపీ(కర్నూల్) రాష్ట్రాలను కలుపు గద్వాల్ జిల్లాలోని ప్రధాన రహదారులు భారీ వర్షాలకు గుంతలమయంగా మారి మరింత ఛిదంగా మారాయి. గోతులతో నిండిన రోడ్లు కొన్ని అయితే... రాళ్లు తేలిపోయిన రహదారులు మరికొన్ని. ఛిద్రంగా మారిన ఆయా రహదారుల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు నకరయాతన పడుతున్నారు. ఏళ్లుగా రహదారుల మరమ్మతులు లేకపోవడంతో తారు లేచి, కంకర తేలిన ఆర్అండ్ బి రహదారులు.. కచ్చా రోడ్ల కంటే దారుణంగా తయారయ్యాయి. వీటిపై రాకపోకలు నిర్వహించే ద్విచక్ర వాహన దారులు తరచూ ఒళ్లు నొప్పులతో అవస్థలు పడుతున్నారు. వాహనాలు మరమ్మతుకు గురవుతున్నాయి. నిధులున్న ప్రాంతాల్లో కూడా అధికారులు పనులు చేయకపోవడం శోచనీయం..రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉన్నా అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవటం లేదని జిల్లా ప్రజ లు, వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి రహదారులు మరమ్మతులు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రం నుంచి అయిజ వైపు వెళ్లే ప్రధాన రహదారి భారీవర్షాలకు గుంతలమయంగా మారింది. మేలచెర్వు చౌరస్తా, అయిజ రైల్వే బ్రిడ్జి, కొండపల్లి చౌరస్తా వరకు గతంలో వేసిన రోడ్లన్నీ భారీ వర్షాలకు, భారీ వాహనాల రాకపోకలతో గుంతలమయంగా మారింది. ధరూర్ మండల కేంద్రం గుండా వెళ్తూ తెలంగాణ కర్ణాటక రాష్ట్రాల మధ్య కలుపు ప్రధాన రహదారిపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ వర్షాలకు బురదమయంగా మారింది. ఇలాంటి రహదారి ప్రయాణానికి అనుకూలంగా లేకుండా గుంతలుగా మారి ప్రమాదాలకు నిలువుగా మారింది. గద్వాల, మక్తల్, ఆత్మకూరు, తదితర ప్రాంతాలకు ప్రియదర్శిని జూరాల మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ధరూర్ మండలం చింతరేవుల గ్రామంలో ప్రధాన రహదారిపై గోతులు ఏర్పడాయి. డ్యాం సమీపంలోగల జీరో పాయింట్ వద్ద గుంతల రోడ్డు మార్గానే ప్రయాణించాల్సి వస్తోంది.అయిజ శాంతినగర్ మధ్యన గల కర్నూల్ రోడ్డు మార్గాన అయిజ సమీపంలో పెద్ద వాగుపై ఉన్న ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ఇలా జిల్లాలో ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ రహదారులకు మరమ్మతులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆయా రోడ్లకు శాశ్వత ప్రాతిప దికన మరమ్మతులు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ఆర్ అండ్ బి ఏఈ రాజేశ్వర్వీ ని వివరణ కోరగా ధరూర్ మండల కేంద్రంలో జాతీయ రహదారి మరమ్మతుకు నిధులు ఉన్నాయి కాని టెండర్ లు వేయడానికి ఎవరు ముందుకు రావడం లేదు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో అయిజ రోడ్ లో ఏర్పడిన గుంతలను త్వరలో మరమ్మత్తులు చేస్తామని పేర్కొన్నారు.



జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేస్తున్న ప్రజలు

## గద్వాల జిల్లా కార్మిక శాఖ కార్యాలయాన్ని తక్షణమే మార్చాలి

గద్వాల,జూలై23(ప్రభాత ఉదయం): గద్వాల జిల్లా జాయింట్ కలెక్టర్ కి కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మిక సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంజిపేట రాజు మాట్లాడుతూ... జోగులంభ గద్వాల జిల్లా కార్మిక శాఖ కార్యాలయాన్ని తక్షణమే మార్చాలి,శిథిలావస్థలో కార్మిక శాఖ కార్యాలయ పైకప్పు పెచ్చులు ఊడుతూ క్రింద పడిపోతుండడంతో కార్మికులు బిక్కు బిక్కుమంటూ కార్యాలయానికి వస్తున్నారని, భవన, ఇతర నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డ్ ద్వారా 2022-2023 సంవత్సరాలలో నమోదు చేసుకున్న క్లెయిమ్స్ రెండు సంవత్సరాలు గడుస్తున్న కార్మికుల ఖాతాలో నిధులు జమకాలేదు. పెండింగ్ లో ఉన్న క్లెయిమ్స్ సత్వరమే కార్మికుల ఖాతలో విధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం గద్వాల పట్టణ కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం యందు భవన నిర్మాణ కార్మికుల బాధితులతో కలిసి ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ యం.వెంకటేశ్వర్లు కు వినతిపత్రం అందజేశారు.జోగులంభ గద్వాల జిల్లా,గద్యాల పట్టణం కేంద్రలోని పాత కలెక్టర్ కార్యాలయం వెనుక 2020 వ సంవత్సరం నుండి గద్వాల జిల్లా కార్మిక శాఖ కార్యాలయం ( అసిస్టెంట్ లేబర్ కార్యాలయం)వుంది. శిథిలావస్థలో ఉన్న కార్మిక శాఖ కార్యాలయం మరమ్మత్తులు చేపట్టాలి.జిల్లా నలుమూలల నుండి నిత్యం వందలాది మంది కార్మికులు వివిధ పనుల నిమిత్తం కార్మిక శాఖ కార్యాలయానికి వస్తుంటారు. కొన్ని రోజులుగా కురుస్తున్నా వర్షానికి కార్యాలయంలోని గదులు వర్షపు నీటితో తడుస్తున్నాయి.కార్మాలయం మొత్తం చిత చిత్తడిగా మారింది.మరోవైపు పైకప్పులో నుండి నీరు కారుతుండడంతో కార్యాలయంలో కార్మికులు సంక్షేమ పథకాల కోసం ధరఖాస్తు చేసుకున్న బరిజినల్ ఫైల్స్ సైతం తడిసిపోతునాయి., కార్యాలయ పైకప్పు పెచ్చులు ఊడుతూ క్రింద పడిపోతుండడంతో ఏ సమయంలో ఏది కూలి క్రింద పడిపోతుందో అని ప్రాణభయంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విధులు నిర్వహించే సిబ్బంది సైతం బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. కావున తక్షణమే కార్మిక శాఖ కార్యాలయాన్ని నూతన కలెక్టర్ కార్యాలయలోకి మార్చగలరని కోరారు. భవన , ఇతర నిర్మాణ కార్మికులకు రావల్సిన పెండింగ్ క్లయిమ్స్ లను వెంటన విడుదల చేయాలి,జోగుళాంఖ గద్వాల జిల్లాలలో శాశ్వతమైన (అసిస్టెంట్ ఆఫ్ లేబర్ కమీషనర్) ని నియమించాలి, జోగుళాంబ గద్వాల జిల్లాలలో లేబర్ ఆఫీసులో అదనంగా ఒక కంప్యూటర్ ఆపరేటర్ ని నియమించాలి, ప్రసూతి సహాయం కోసం రూ. 50 వేలు ఇవ్వాలి ,పెళ్ళి కానుకగా 50వేల రూపాయలు ఇవ్వాలి, సహజ మరణానికి రెండు లక్షల అరవై వేలు ఇవ్వాలి,ప్రమాదవశాత్తు మరణానికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలి , దరఖాస్తు చేసుకున్న నిర్మాణ రంగ కార్మికులకు రేటర్ కార్డులను సకాలంలో అందజేయాలి., సంక్షేమ బోర్డ్ ద్వారా నమోదు చేసుకున్న క్లైమాస్ సకాలంలో విధులు మంజూరు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టి యు, పిడిఎస్ యు నాయకులు ,భవన నిర్మాణ కార్మికులు తదితరులు తిరుమలేష్, లక్ష్మీ నారాయణ, బీచుపల్లి,బడేసాబ్, కోళ్ళ రాజు,ఆనంద్,మహేష్,వెంకటేష్,వడ్డే లక్ష్మి,భాగ్యమ్మ,తెలుగు లక్ష్మీ,స్వాతీ, జములమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన బిఆర్ఎస్ నాయకులు పూర్ణచందర్ రెడ్డి



శంషాబాద్,జూలై 23( ప్రభాత ఉదయం): టిఆర్ఎస్ పార్టీ శంషాబాద్ మున్సిపల్ ఉ పాధ్యక్షుడు కొలను పూర్ణచందర్ రెడ్డి మంగళవారం భారతీయ జనతా పార్టీలో చేరారు. చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా పూర్ణచందర్ రెడ్డి మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గం లో ముఖ్యంగా శంషాబాద్ పట్టణంలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు. పార్లమెంట్ సభ్యుడు హెూండా విశ్వేశ్వర్ రెడ్డి. నియోజకవర్గ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో పార్టీ పటిష్టానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ప్రేమ్ రాజ్. జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిషోర్. మున్సిపల్ అధ్యక్షుడు కొనమోల దేవేందర్. కొలను ప్రదీప్ రెడ్డి. కొలను జగ్జీవన్ రెడ్డి తదితరుల సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. పార్టీలో చేరిన ఆయనను ఆ పార్టీ సీనియర్ నాయకులు అభినందించారు.



వైద్య కళాశాల పనులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ సంతోష్

## మెడికల్ కళాశాల పనులన్నింటినీ వేగవంతంగా చేయాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 23(ప్రభాత ఉదయం)ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులన్నింటినీ వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకోరావాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఐ.డి.ఓ.సి కాన్ఫరెన్స్ హాల్ నందు నూతన మెడికల్ కళాశాలకు సంబందించిన పనుల పురోగతి పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్ఎంసీ మార్గదర్శకాలకు అనుగుణంగా వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలని సూచించారు. హాస్పిటల్‌లో ఉన్న పోస్టుల వివరాలు, అర్హతలు తెలియజేసినట్లయితే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయుటకు వీలు పడుతుందన్నారు. అవసరమైన పరికరాలతో పాటు హాస్పిటల్స్ లోని బెడ్స్ మరియు ఇతర వైద్య ఎక్విప్మెంట్స్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అవి సరిగ్గా పనిచేస్తున్నాయా లేదా పరిశీలించుకోవాలని సూచించారు. అవసరం మేరకు పరికరాలను అలంపూర్ ఆసుపత్రి నుండి తెప్పించాలన్నారు. మెడికల్ కాలేజీలో ప్రొఫెషనల్ అధ్యాపకులు అందరూ కలిసి ఒక కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మెడికల్ కాలేజీలకు కావాల్సిన నీరు, విద్యుత్తు వంటి అన్ని వసతులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రతి ఒక్క అంశాన్ని పరిగణలోకి తీసుకుని, అందరూ సమష్టిగా పని చేసి, మెడికల్ కళాశాలను త్వరగా సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ పార్వతి, డిప్యూటి డి.ఎం.హెచ్.ఓ సిద్దప్ప, హాస్పిటల్ సుపెర్డిదేంట్ డా.నవీన్ క్రాంతి, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డా.వృశాలి, మిషన్ భగీరథ ఈ.ఈ భీమేశ్వర్ రావు, ఎంప్లాయిమెంట్ అధికారి ప్రియాంక, కళాశాల మెడికల్ సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

### మెడికల్ కాలేజ్ పరిశీలన

సమావేశం అనంతరం పట్టణ శివారులో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలను కలెక్టర్ పరిశీ లించారు. ఈ సందర్భంగా కాలేజీలో ఉన్న వసతులను పరిశీలించారు. మెడికల్ కళాశాలకు అనుమతుల అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పించి డాక్టర్లు, సిబ్బందిని నియమించే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు అయన అన్నారు. డిపార్ట్మెంట్ వారీగా అవసరాలను అడిగి తెలుసుకున్నారు. పనులలో అవసరమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి వెంటనే తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.



కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న జలమండలి ఎండి అశోక్ రెడ్డి

## జలమండలిలో ముగ్గురికి కారుణ్య నియామకం

సిటీ బ్యూరో, జూలై23(ప్రభాత ఉదయం): జలమండలిలో ముగ్గురికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు లభించాయి. బోర్డులో విధులు నిర్వర్తిస్తూ ఉండగానే మరణించిన ముగ్గురి ఉద్యోగుల వారసులకు.. వారి విద్యార్హతలు బట్టి, కారుణ్య నియామకం కింద ఉపాధి కల్పించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో ఎండి అశోక్ రెడ్డి ఈ నియామక పత్రాలను మంగళవారం వారికి అందించారు. ఈ సందర్భంగా ఆయన వారికి శుభాకాంక్షలు తెలుపుతూ.. కష్టపడి పని చేసి బోర్డుకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ డైరెక్టర్ వాసుదేవనాయుడు, పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్ తెలంగాణపై వివక్ష



గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 23(ప్రభాత ఉదయం)కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు మొండి చేయి చూపడం రాజకీయ వివక్ష స్పష్టంగా కన్పిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి అంజనేయులు అన్నారు. మంగళవారం పార్లమెంట్ లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ విభజన హామీల కు నిధులివ్వలేదని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, యూనివర్శిటీల ఏర్పాటు,కొన్ని రైల్వే కొచ్ ల నిర్మాణం రైలు మార్గాలు ఏర్పాటు వంటి వాటిని విస్మరించి దన్నారు. అలాగే దేశంలో నిరుద్యోగం, పేదరికం నిర్మూలించ డానికి ఎలాంటి ప్రతిపాదన బడ్జెట్ లో లేదన్నారు. ప్రభుత్వ రంగాల పరిశ్రమల రక్షణ, కొత్తగా నిర్మాణం వంటి ప్రయత్నాలు ఏమి చేయలేదంటే దీని అర్థం దేశాన్ని మొత్తం బడ వ్యాపారుల కోసం వారిచేతుల్లోకి పరిశ్రమలను నెట్టి వారికి మాత్రమే ఈ బడ్జెట్ లో రాయితీలు ఇచ్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలకు సామాన్యులకు వినియోగదారులకు ఎలాంటి ఉపయోగకరమైన ప్రతిపాదనలు ధరల తగ్గింపు ఈ బడ్జెట్లో లేవన్నారు. 2047కి వికసిత భారత్ అని ప్రకటించడం ప్రైవేట్ శక్తులకు మాత్రమే అన్నట్లుందన్నారు. మద్దతు ధరలు ఎంతని చెప్పకుండా మాటలకే పరిమితం చేశారన్నారు. ఇలా మొత్తం బడ్జెట్ సామాన్యుల వ్యతిరేక వ్యాపారుల అనుకూల బడ్జెట్ ఇది తెలంగాణకు తీరని అన్యాయ బడ్జెట్ అని పేర్కొన్నారు.

## నిరంతరంగా కురుస్తున్న వర్షాల నుండి ఉద్యాన పంటల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలి

రాజేంద్రనగర్, జూలై 23(ప్రభాత ఉదయం) ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన ఉద్యాన పంటలకు నష్టం జరగొచ్చు అని క్షేత్రస్థాయిలో పంట నివారణకు సూచనలు పాటించాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలలో నీరు నిలిచి పొలాల్లో నష్ట తీవ్రత అధికం. ఈ వర్షాల కారణంగా పోషక సరఫరాజు అంతరాయం కలుగుట, పంటంలో పురుగులు, తెస్యులి బెడద ఎక్కువగా ఉంది. నష్ట తీవ్రతను తగ్గించుటకు తక్షణ చర్యలు చేపట్టాలి. ముందుగా రైతులు తను పొలంలో నిలిచిన అఖర నీటిని తీసివేయాలి. పంట 13-0-45 5ఏ లేటరు నీటికి చొప్పున పినిగం చేసుకోం కూరగాయ పంటలలో మొక్కల మొదళ్ళకు మట్టిని ఎగదోయిలు, 19-19-19 5 లీటరు నీటికి చొప్పున పిచికారి చేయాలి. ఇనుము ధాతువు లోప నివారణకు అన్నవిషం నిమ్మ ఉప్పు కలిపి పిచికారి చేయుట. ఆరో మచ్చ, పక్షి కనాన్ని తెగులు నివారణకు కార్బెండ జమ్ మ్యాంకోజెబ్ మందు 2.5 లీటరు నీటికి కలిపి పిచదేవ్ చేయాలి. బాక్టీరియా ఆకు మచ్చ తెగులు ని రిసీవ్ కాపర్ అల్సీ క్లోరైడ్ 30ది ం ప్లాంటామైనస్ కలిపి పిచికారి చేసుకోవాలి. పండ్ల తోటల్లో ప్రధానంగా మామిడిలో విరిగిన కొమ్మలను కత్తిరించి. బోర్డ పేస్టు రాజ కాపర్ అన్సి క్లోరైడ్ పూయాలి. పండ్ల చెట్లూ %జశీ% ప్రతి చెట్టుకో కా0లర్రి య 400ఏ %మీూ% 25 కిలోల పరుపుల ఎరువు వేసుకోవాలి. ద్రాక్ష పంటలో ఆటరో నీటికి 3 ఏ 0-52-34 ఎరుద్ర వారం వ్యవదిలో 2-3 సార్లు పిచికారి చేయాలి. బూజు తెగులు నివారణకు బోర్డా మిశ్రమం తిని కాపర్ ఫైట్రెక్టడ్ పింకిరి చేసుకోవాలి. బత్తాయి కాయ కుళ్ళు నివారణ కార్బెండజిన్స్ నీటితో పిచికారి చేయాలి.జామలో పోషక లోప సవరణగా మెగ్నిషియం సర్ ఫైట్ 56 లీటరు నీటికి చొప్పున పిచ్కారి చేయాలి. ఈ చర్చులు చేపట్టను తక్కువ నష్టం ప్రధాన శాస్త్రవేత్త టి. సూష్ కుమార్ రెడ్డి, తెలంగాణ వి మండలం అగిపతి, డాక్టర్ డి అనిత కుమారి, ప్రధాన శాస్త్రవేత్త, పరిశోధనా స్థానం డాక్టర్ లక్ష్మి నారాయణ లు రైతులకు సూచనలు చేశారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

శంషాబాద్, జూలై 23 (ప్రభాత ఉదయం): శంషాబాద్ మండలంలోని కవ్వగూడ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద మంజూరి అయిన చెక్కులను మంగళవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అందజేశారు. కవ్వగూడ మాజీ సర్పంచ్ దేవరకొండ రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చొరవతో లబ్ధిదారులకు సకాలంలో చెక్కులను అందజేయడం జరుగుతుందని అన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆయన ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ వారికి చేదోడు వాదోడుగా ఉంటున్నారని తెలిపారు. ప్రకాష్ గౌడ్ నేతృత్వంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధిస్తుందని రమేష్ యాదవ్ పేరు కొన్నారు.



చికిత్స కోసం పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## వైద్య సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, జూలై 23 (ప్రభాత ఉదయం) సీఎం రిలీఫ్ ఫండ్ పేదల వైద్యానికి వరం లాంటిదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం మల్కాజిగిరి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిది ద్వారా వైద్య చికిత్స కొరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎల్. ఓ.సి లను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అందజేశారు. నేరేడ్ మెట్ డివిజన్‌కు చెందిన జనార్ధన్ రావు కు లక్ష పదివేల రూపాయలు, అల్వాల్ డివిజన్‌కు చెందిన గోవింద రాజుకు 1,75వేల రూపాయలు ,అల్వాల్‌కు చెందిన భాగ్యలక్ష్మీకి 1 లక్ష 75 వేల రూపాయలు, వెంకటాపురం మచ్చ బొల్లారంకు చెందిన వెంకటేష్ కి 1లక్ష 75 వేల రూపాయలు ఎల్ఓసి లను వైద్యం కోసం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, డోలీ రమేష్, ఉష, సంతోష్ గుప్తా, శైలెందర్ తదితరులున్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.